క్లుప్తంగా

నేడు గడప గడపకు..

పలమనేరు: మున్సిపాలిటీలోని 20,21 వార్డుల పరిధిలో మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. మదనపల్లె రోడ్డులోని మారెమ్మ ఆలయం నుంచి ఎమ్మెల్యే ఈ కార్యక్రమానికి పూనుకుంటారని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీం

రొంపిచెర్ల: అంగన్‌వాడీ కేంద్రాలలో పాఠశాలల వాతావరణం ఉండాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీం అన్నారు. సోమవారం ఆయన బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలోని ఫజులుపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలోని సిమెంటు రాళ్ల వల్లన పిల్లలకు ప్రమాదం కలిగే అవకాశం ఉందని, వీటిని బయట వేయాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించి పిల్లల ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలన్నారు.

క్రీడాసామగ్రి వితరణ


కల్లూరులో క్రీడాకారులకు క్రీడాసామగ్రి అందజేస్తున్న మహమ్మదాలీ

పులిచెర్ల(కల్లూరు): లయన్స్ క్లబ్ జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడు లయన్ మహమ్మదాలీ సోమవారం క్రీడాకారులకు క్రీడాసామగ్రిని అందజేశారు. క్రికెట్ బ్యాట్లు, వాలీబాల్, నెట్‌లు, టెన్ని కాయిట్ బాల్, నెట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కల్లూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తాతయ్య, సభ్యులు ప్రభాకర్, కమరిలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్సీ ఆర్థిక సాయం


మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి

గుడుపల్లె: మండలంలోని గుండ్లసాగరం గ్రామ పంచాయతీ గుత్తర్లపల్లెకు చెందిన వేణుగోపాల్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఇది తెలుసుకున్న జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని జెడ్పీటీసీ సభ్యుడు క్రిష్ణమూర్తి ద్వారా అతడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ శ్రీకాంత్, కో–ఆప్షన్ మెంబర్ అన్సర్, వరదరాజులు పాల్గొన్నారు.

గణనాథుని సేవలో ప్రభుత్వ కార్యదర్శి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఐఏఎస్ రామ్‌గోపాల్ దర్శించుకున్నారు. సోమవారం కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులతో ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ రవి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

యాదమరి: మండల పరిధిలో కిశోర బాలికలకు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా గణాంకాల అధికారి జార్జ్ అన్నారు. సోమవారం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సంతగేటు ప్రభుత్వ ఆస్పత్రిలో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలే మైనర్ వివాహాలను నిలుపుదల చేయాలని కోరారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి తగిన సలహాలు, సూచనలు చేయాలన్నారు. వారికి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. వైద్యాధికారి సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం ఏపీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఏపీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ గోపీనాథ్, ఎస్వీబీసీ మాజీ సీఈఓ శర్మ దర్శించుకున్నారు.

స్కూళ్ల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీలు

- ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులకు భాగస్వామ్యం
- గ్రామాల్లోని బడుల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం


బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ (ఫైల్)

పలమనేరు: నాడు: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు స్కూళ్ల నిర్వహిస్తున్న పార్టీలోని ముఖ్య నాయకులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసే దిశగా విధానాలు అమలు చేసింది. నాటి ప్రభుత్వ నిర్లక్ష్యంతో బడులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పించేలా పరోక్షంగా చేసి, ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పడిపోవడానికి కారణమైంది. కనీసం తల్లిదండ్రుల కమిటీలు, పిల్లల చదువులపై ఏమాత్రం తెలియకుండా పోయేది. అంతేకాకుండా హేతుబద్ధీకరణ పేరిట చాలా బడులను మూసేసింది. ఇది నాటి టీడీపీ పాలనలో పరిస్థితి.

నేడు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోనే సమాజం బాగుపడుతుందని భావించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకంతో బడుల రూపురేఖలను మార్చేసింది. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా వీటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆహారం పెట్టడంతోపాటు విద్యాకానుక పేరిట పుస్తకాలు, బ్యాగులు, షూస్..అన్నీనూ సమకూర్చింది. దీంతో ప్రభుత్వ స్కూళ్లు మళ్లీ కళకళలాడాయి. అంతేకాకుండా పిల్లల చదువులు, పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులనూ భాగస్వాముల్ని చేసింది. పేరెంట్స్ కమిటీ సమావేశాలను నిర్వహించి, ఆ స్కూళ్ల అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించేలా వారికి ప్రాధాన్యతనిచ్చింది.

జిల్లాలోని బడుల సమాచారం	
ఉన్నత పాఠశాలలు:	515
చదువుతున్న విద్యార్థులు:	1.25లక్షలు
ప్రాథమికోన్నత పాఠశాలలు:	287
విద్యార్థులు:	26వేలు
ప్రాథమిక పాఠశాలలు:	2079
విద్యార్థులు:	93,500
జిల్లాలోని మొత్తం పాఠశాలలు:	2881
మొత్తం విద్యార్థులు:	2,44,500 మంది

సమావేశాల్లో ఇవే కీలకం

ప్రతినెలా నిర్వహించే సమావేశాలకు కమిటీ సభ్యులతోపాటు పిల్లల తల్లిదండ్రులు హాజరవుతారు. విద్యార్థుల వ్యక్తిగత ప్రగతిపై టీచర్లు వివరిస్తారు. పిల్లల ప్రవర్తన, చదువులో బలహీనత, హాజరు తదితరాలను వారికి వివరిస్తారు. అక్కడ చర్చించిన అంశాలను మినిట్స్ బుక్‌లో నమోదు చేస్తారు. చర్చించిన అంశాలను, పేరెంట్స్ సూచనలను హెచ్‌ఎంలు ఎంఈఓకు, ఎంఈఓలు డీఈఓకు నివేదిస్తారు.

సమావేశాలతో కలిగే ప్రయోజనాలు

- బడికి, సమాజానికి ఇదో అనుసంధాన కార్యక్రమం
- పిల్లల సామర్థ్యాలపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలుస్తుంది
- బడిలో జగనన్న గోరుముద్ద, నాడు–నేడు, జగనన్న విద్యాకానుక..తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కలుగుతుంది.
- మధ్యాహ్న భోజనంపై నిర్వాహకులు, హెచ్‌ఎంలకు బాధ్యత, జవాబుదారీతనం
- టీచర్లు పేరెంట్స్ కమిటీ సూచనలు–సలహాలను పరిగణనలోకి తీసుకుంటారు
- పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడంలో తల్లిదండ్రులు కూడా కీలకమవుతారు.

ప్రభుత్వ నిర్ణయం భేష్

బడికి పిల్లల్ని పంపడం మాత్రమే మాకు తెలుసు. సంవత్సరానికోసారి మార్కుల కార్డు ఇస్తే దానిపై సంతకం పెట్టి పంపేవాళ్లం. కానీ ఈ ప్రభుత్వంలో తల్లిదండ్రులకు..బడికి మంచి సంబంధాన్ని కల్పించింది. దీంతో బడిలో ఏం జరుగుతోందో మేము కూడా చూసే అవకాశం కలిగింది. మా పిల్లలు ఎలా చదువుతున్నారు? వారి ప్రవర్తన ఎలా ఉందో తెలుస్తుంది.

–భువనేశ్వరి, బాలికోన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్, పలమనేరు



మాపై మరింత బాధ్యత

తల్లిదండ్రుల కమిటీలను బడిలో భాగస్వామ్యులను చేయడంతో మాపై కూడా మరింత బాధ్యత పెరిగింది. ప్రభుత్వం విద్యారంగానికి కూడా ప్రాధాన్యతనిచ్చి, కోట్లాది రూపాయలు వ్యయం చేస్తోంది. ఉత్తమ ఫలితాలు రాకుంటే ఇదంతా వ్యర్థమే కదా!? పేరెంట్స్ కమిటీలు కూడా పర్యవేక్షించే అవకాశం కల్పించడంతో తమ పిల్లల చదువులపై వారికీ శ్రద్ధ పెరుగుతోంది. స్కూళ్లలో టీచర్లు ఏం చెబుతున్నారు? పిల్లల విద్యాప్రగతి ఎలా ఉందో తెలుసుకోగలుగుతారు.

–లీలారాణి, ఎంఈఓ, పలమనేరు

అంగన్‌వాడీ సిబ్బందికి యూనిఫాం


అంగన్‌వాడీ కార్యకర్తలకు యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాంను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ఎంపీపీ ఈశ్వరయ్య పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని, గర్భిణులు సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గంగాధరం, వైస్ ఎంపీపీ ప్రభాకర, ఎంపీడీఓ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


నిహాన్


అఖిల తేజ


తేజ సాయి

సోమల: మండలంలోని కందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఆ స్కూలు హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి సోమవారం తెలిపారు. తొలి విడతలో మిత్ర తేజ సాయి, మూడవ విడతలో నిహాన్, అఖిలతేజ ఎంపికయ్యారని చెప్పారు. వారిని హెచ్‌ఎం, టీచర్లు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గాలి సురేష్, ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ మసూద్ తదితరులు అభినందించారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకుని స్కూలుకు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఆకాంక్షించారు.

కరెంటు షాక్‌తో పెయింటర్ మృతి


మృతి చెందిన రాజా

వి.కోట: కరెంటు షాక్‌కు గురై పెయింటర్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. మండలంలోని పాముగానిపల్లె పంచాయతీ బైసుకుప్పం గ్రామానికి చెందిన యువతిని నెల్లూరు జిల్లాకు చెందిన భరత్‌కుమార్ వివాహం చేసుకుని ఇక్కడే పెయింటర్‌గా స్థిరపడ్డాడు. గ్రామ సమీపంలోని వేణుగోపాలపురంలో నూతనంగా నిర్మించిన ఓ ఇంటికి పెయింటింగ్ చేయవలసి ఉండగా నెల్లూరుకు చెందిన రాజా అనే వ్యక్తిని వెంట పెట్టుకుని ఆ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం పెయింట్ వేస్తూ ఇంటికి దరిదాపుల్లోని త్రీఫేజ్ విద్యుత్ తీగలు తగలడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు హుటాహుటిన వి.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు రాజా అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. భరతకుమార్‌కు చికిత్స చేస్తున్నారు.

మండల పశువైద్యాధికారికి సన్మానం


పశు వైద్యాధికారి శ్రీధర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

రొంపిచెర్ల: ఉత్తమ పశు వైద్యుడి ప్రశంసాపత్రం అందుకున్న డాక్టర్ శ్రీధర్‌ను సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఇటీవల ఆయన స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది అరుణ, అల్తాఫ్ బాషా, పునీత్‌కుమార్, రాజేష్, నందకుమార్, సంపత్, మోహిత్, శేఖర్, రెడ్డెప్పరెడ్డి, హేమేంద్రనాయుడు, శ్రీనివాసులు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన


సదుం : స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ షన్మోహన్

సదుం: స్థానిక జెడ్పీ హైస్కూలులో నాడు–నేడు పనులను జిల్లా కలెక్టర్ షన్మోహన్ సోమవారం తనిఖీ చేశారు. గతంలో 21 తరగతి గదులు మంజూరు కాగా, 14 గదులు స్లాబ్ స్థాయిని దాటిందని సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. మరో 7 గదుల నిర్మాణానికి, ప్రహరీ మంజూరు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అంతకుముందు బీసీ గురుకుల కళాశాల్లో ఈ సంవత్సరం నుంచి ప్రారంభమైన జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం హాస్టల్ నిర్మాణానికి ఆయన స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, సోషియల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ డీడీలు రాజ్యలక్ష్మి, రబ్బాని బాషా, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, పుత్రాజు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల నిర్మాణ పనులు..

వి.కోట: మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ కుదవగడ్డ గ్రామంలో మురుగు కాలువల నిర్మాణ పనులను ఎంపీపీ యువరాజు సోమవారం పరిశీలించారు. త్వరిగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు భూమి పూజ



కుప్పం రూరల్: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బీఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్ ఏర్పాటుకు అధికారులు, నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. కుప్పం మండలంలోని అడవిబూదుగూరు, సమీప గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదని వైఎస్సార్ సీపీ నాయకులు ఇటీవల ఎంపీ రెడ్డెప్ప, బీఎస్ఎన్ఎల్ అధికారుల దృష్టికి తీసుకురావడంతో వారు స్పందించారు. అడవి బూదుగూరు వద్ద టవర్ నిర్మాణానికి చర్యలు తీసుకుని భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, బీఎస్ఎన్ఎల్ ఎస్డీ బాల శరవణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న గ్రేట్ బాంబే సర్కస్



సర్కస్‌లో వినోదం పంచుతున్న బఫూన్లు

తిరుపతి కల్చరల్: ఆసియాలోనే అతి పెద్ద సర్కస్ కంపెనీ గ్రేట్ బాంబే సర్కస్ ఆధ్వర్యంలో డీబీఆర్ రోడ్డులోని యాలమూరి పార్కులో ఏర్పాటు చేసిన గ్రేట్ బాంబే సర్కస్ ప్రజలకు విశేషంగా ఆకట్టుకుంటోంది. నిర్వాహకులు సంజీవ్, ఇలియాజ్ ఖాన్, రమేష్ మాట్లాడుతూ వందేళ్లుగా దేశవ్యాప్తంగా అనే ప్రాంతాల్లో సర్కస్‌ను ప్రదర్శిస్తూ వింత వింత ఫీట్లు చేస్తూ ప్రజాదరణ పొందుతున్నామన్నారు. ప్రస్తుతం తిరుపతిలో సర్కస్‌లో సైక్లింగ్, స్కైవాక్, జిమ్నాస్టిక్స్, సోమర్‌సాల్ట్, రోప్ వాకర్స్, ఫైర్ ఈటర్స్, స్విపర్స్, హువార్స్, ట్రాపెజిస్ట్, డ్యాన్సర్లు, రష్యన్, ఆఫ్రికన్ కళాకారులు, పులులు, సింహాలు, గజరాజులను ఆడించే రింగ్ మాస్టర్లతో పలు ఫీట్లు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటిగంటకు, సాయంత్రం 4, రాత్రి 7 గంటలకు మూడు షోలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

8 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

తిరుపతి క్రైం: ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చార్మినార్ లాడ్జిలో 8 మంది పేకాటరాయుళ్లను ఎస్‌ఐ నాగేంద్రబాబు సోమవారం అరెస్ట్ చేశారు. తిరుపతిలో నివాసం ఉంటున్న శివనాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్ రెడ్డి, అభిరెడ్డి, మునిరెడ్డి, వెంగన్న మునిరెడ్డి, దేవేందర్ రెడ్డి, శివశంకర్ రెడ్డి పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందని ఎస్‌ఐ చెప్పారు. సిబ్బందితో దాడులు చేశారు. రూ.52,500 స్వాధీనం చేసుకుని ఎనిమిది మందిని అరెస్ట్ చేశామన్నారు. లాడ్జి యజమానిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

జగనన్న లేఅవుట్ వివాదంపై మంత్రికి ఫిర్యాదు


రొంపిచెర్ల : జగనన్న కాలనీ వివాదంపై మంత్రి పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డు వద్ద ఉన్న జగనన్న లేఅవుట్ వివాదంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సోమవారం ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. జగనన్న లేఅవుట్‌లో ప్లాట్లు వేసేందుకు నంబరు రాళ్లు నాటితే గ్రామానికి చెందిన మహ్మద్‌బాషా వాటిని రాత్రి రాత్రే పెకలించి వేశాడని తెలిపారు. జగనన్న లేఅవుట్ కోసం అధికారులు 9 ఎకరాల భూమిని సేకరించారని, ఇందులో 1.70 సెంట్ల భూమిని అన్నదమ్ములైన షమీమ్, మహబూబ్‌బాషాల నుంచి సేకరించినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన సొమ్ము రూ.6లక్షలు షమీమ్ ఖాతాలో రెవెన్యూ అధికారులు జమ చేయడంతో అందులో సగం సొమ్ము తనకు ఇప్పించాలని, అంతవరకు అక్కడ ఎలాంటి పనులు చేయరాదని నంబర్ రాళ్లను పెకలించివేసినట్లు మంత్రికి నివేదించారు. ఈ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ అమరనాథ్‌ను మంత్రి ఆదేశించారు. అనంతరం చెంచెంరెడ్డిగారిపల్లె మాజీ సర్పంచ్ రామనారాయణ రెడ్డి గృహ ప్రవేశానికి మంత్రి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సలీంబాషా, విజయశేఖర్, కోటా వెంకటరమణ, సూర్య నారాయణ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కరీముల్లా, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు మంత్రి ఆశీస్సులు

సోమల: మండలంలోని కామిరెడ్డిగారిపల్లెకు పంచాయతీకి చెందిన వెంకట రమణారెడ్డి కుమారుడు నవీన్ కుమార్ రెడ్డికి, చిన్న సోమలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మల్లికార్జున రెడ్డి కుమార్తె అలేఖ్యారెడ్డికి ఆదివారం వివాహమైంది. సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వరుడి స్వగృహానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో మంత్రి పెద్దిరెడ్డి


బండారువారిపల్లెలో కోదండ రామాలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని బండారువారిపల్లె(కురవపల్లె)లో సోమవారం కోదండరామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిప్రపత్తుల్తో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. పూజల్లో పాల్గొన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి,రెడ్డీశ్వరరెడ్డి, నాధమునిరెడ్డి, నరసింహులు శెట్టి, వైస్ ఎంపీపీ ఈశ్వరి, సర్పంచులు రాణెమ్మ, నాగరాణి, గోవర్ధన్, గోవిందరెడ్డి, ప్రభాకర్, నాగిరెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి


బోడిపాటివారిపల్లెలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీ శివకుమార్

రొంపిచెర్ల: రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని పుంగనూరు డివిజన్ ఏడీ శివకుమార్ కోరారు. సోమవారం ఆయన మండలంలోని బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీలో ఈ–క్రాప్ నమోదును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ–క్రాప్ నమోదు వలన కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ప్రకృతి విపత్తుల వలన పంటలు నష్టపోతే పరిహారం, పంట రాయితీ పొందవచ్చని, అలాగే సున్నా వడ్డీ, సబ్సిడీ పరికరాలు, ఎరువులు, పురుగు మందులను ఇస్తామని, రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలకు అర్హత కూడా ఉంటుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధారాణి, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్, రైతులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: ప్రతి రైతూ పండించిన పంటలను స్థానిక రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలని పుంగనూరు వ్యవసాయ శాఖ ఏడీ శివకుమార్ సూచించారు. సోమవారం మండలంలోని నెల్లిమంద, వల్లిగట్ల, కందూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈ–క్రాప్ నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్, వీఏఏ అలీయా పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ఆందోళన


ఏఓకు వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్ల సంఘ నాయకురాళ్లు

పలమనేరు: ఆశావర్కర్లకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలోని ఆశావర్కర్లు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. దీనికి నేతృత్వం వహించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ, ఆశావర్కర్ల చేత సంబంధం లేని పనులు చేయిస్తున్నారన్నారు. వాక్సిన్ బాక్సులు మోయడం, ఆన్‌లైన్ పనులు వైద్య సిబ్బంది చేయకుండా ఆశాలపై భారం మోపడం, ఇతర పనులనూ చేయించడం సరికాదన్నారు. అనంతరం కార్యాలయ ఏఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆశా వర్కర్ల అధ్యక్షురాలు గంగ, స్థానిక సీఐటీయూ నాయకులు గిరిధర్‌గుప్త, ఓబుల్‌రాజు, భువనేశ్వరి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ


భూహక్కు పత్రాలు అందుకుంటున్న రైతులు

పూతలపట్టు: మండలంలోని వేనూతనపల్లె పంచాయతీలో ఉన్న రైతులకు సోమవారం వైఎస్సార్–జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులకు సంపూర్ణ భూహక్కు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూహక్కు–భూరక్ష రీసర్వేను చేపట్టిందన్నారు. ఎవరైనా భూ అక్రమాలకు పాల్పడినా, భూ తగాదాలు ఉన్నా న్యాయపరంగా పరిష్కరించేందుకు దీనివల్ల అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వేనూతనపల్లెలో 197 మంది రైతులకు భూ హక్కుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ మునికృష్ణ, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, బాబు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యాన్ని నింపిన త్యాగరాజ సంగీతోత్సవాలు

తిరుపతి కల్చరల్: త్యాగరాజ మండపంలో సోమవారం ప్రదర్శించిన సంగీత కచేరీలు ఆహూతుల్లో భక్తి పారవశాన్ని నింపాయి. త్యాగరాజ మండపంలో త్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు సోమవారానికి నాలుగో రోజుకు చేరాయి. సంగీత విద్వాంసుడు ఓఎస్ అరుణ్ బృందం సంగీత గానాలాపన వీనుల విందు చేసింది. వీరికి వయోలిన్‌పై వీవీ.శ్రీనివాసరావు, మృదంగంపై నైవేలి స్కంధ సుబ్రమణ్యం సహకరించారు. అనంతరం సంగీత కళానిధి లాల్ గుడి జీజేఆర్.క్రిష్ణన్ ఆలపించిన వివిధ త్యాగరాజ సంకీర్తనలు భక్తులను ఓలలాడించాయి. ఆయనకు వయోలిన్‌పై సంగీత కళానిధి విజయలక్ష్మి, మృదంగంపై అరవింద్ రంగనాథన్, కంజీరపై ఆలత్తూర్ రాజగణేష్ సహకారం అందించారు. కళాబృందాలను నిర్వాహకులు మోహన్ సుందరం, కంచి రఘురామ్, ప్రభాకర్ తదితరులు సత్కరించారు.

ధ్యానంతో ముక్తి ప్రసాదం



హాజరైన ధ్యానులు, ప్రసంగిస్తున్న పిరమిడ్ మాస్టర్ జయలక్ష్మి

తవణంపల్లె: ధ్యానం ముక్తి ప్రసాదిస్తుందని ప్రొద్దుటూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శ్రీవిఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ జయలక్ష్మి 18 ఆదర్శ సూత్రాల గురించి వివరించారు. ధ్యానం ద్వారా జ్ఞానం.. జ్ఞానం ద్వారా ముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలక్రిష్ణమూర్తి, రాధిక, ధ్యానులు పాల్గొన్నారు.